క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



డంపింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పీసీపల్లి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కష్టారావు అన్నారు. మండల పరిధిలోనే వేపగుంపల్లి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తడిచెత్త, పొడిచెత్త వేరుగా వేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యాన్ని పరిశీలించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో జ్వర పీడితులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార అవగాహనలో ప్రతిజ్ఞ చేస్తున్న సూపర్‌వైజర్, కార్యకర్తలు

పామూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంఎస్ పార్వతి అన్నారు. మండలంలోని పామూరు, నర్రమారెళ్ల గ్రామాల్లో శనివారం రాష్ట్రీయ పోషణ్ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు విధిగా ముర్రుపాలు ఇవ్వాలని, బిడ్డకు తల్లిపాలు ప్రతి రోజు 12 మార్లు వంతున ఆరు మాసాలపాటు ఇవ్వాలన్నారు. ఈసందర్భంగా ప్రతిజ్ఞచేసి పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ చేశారు. ఎన్‌జీఓ డాక్టర్ షేక్.నాయబ్‌రసూల్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ ప్రారంభం



ఎరువుల పంపిణీని ప్రారంభిస్తున్న ఏఓ మాల్యాద్రి

కొండపి: స్థానిక సొసైటీలో ఎరువుల పంపిణీని వ్యవసాయాధికారి మాల్యాద్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో 12 మెట్రిక్ టన్నుల యూరియా, ఆరు మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు రావెళ్ల రఘునాథ్ బాబు, సభ్యులు బ్రహ్మయ్య, రామిరెడ్డి, పీడీసీసీ బ్యాంకు మేనేజర్ నల్లపు మాల్యాద్రి, సీఈఓ పవన్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి



బెండసాగును పరిశీలించిన అధికారులు

సింగరాయకొండ: కూరగాయల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖాధికారి తేజ అన్నారు. మండలంలోని శానంపూడిలో శనివారం ఉద్యానవన శాఖ, ఆత్మ సౌజన్యంతో కూరగాయల సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానవనశాఖాధికారి తేజ మాట్లాడుతూ రైతులు పొలంలో బులుగు, పసుపురంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని, వేపనూనె, సూక్ష్మపోషకాలు ఉపయోగించి సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: పేదరికం వల్ల ఏ వ్యక్తి న్యాయ సేవలను కోల్పోవద్దనే లక్ష్యంతో ఉచిత న్యాయ సేవలు అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని పీవీఆర్ పార్కులో మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు సంస్థ పనిచేస్తుందన్నారు. గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్, పారా లీగల్ వలంటీర్ మంద్రు రమేష్‌బాబు, తిరుపతయ్య, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులపై చిన్నచూపు..!

- ప్రమాద అంచుల్లో ఇరిగేషన్ చెరువులు
- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం
- ఆక్రమణకు గురవుతున్న చెరువు శివారు ప్రాంత భూములు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పీసీపల్లి:

గ్రామాల్లో తాగు, సాగునీటికి చెరువులు ఎంతో కీలకం. అయితే కూటమి ప్రభుత్వం ఈ చెరువుల పట్ల అలివిమాలిన నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో చెరువులన్నీ ప్రమాదపు అంచున ఉన్నాయి. ప్రస్తుతం అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలు కురిసి ఈ చెరువులకు నీరు చేరితే ఏ చెరువు కట్టలు ఎప్పుడు తెగుతాయోనన్న గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. కనీస మరమ్మతులు కూడా చేయకుండా చెరువులపై చిన్నచూపు చూస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. మండలంలో పంచాయతీరాజ్‌కు సంబంధించి చిన్న చెరువులు 9, మైనర్ ఇరిగేషన్ చెరువులు 15 వరకు ఉన్నాయి. అయితే కొన్ని చెరువులకు ఇటీవల మరమ్మతులు చేసిన అధికారులు కొన్ని చెరువులను పూర్తిగా వదిలేశారు. వాటికి తట్ట మట్టి కూడా పోయలేదు. ఫలితంగా చెరువుల పరిస్థితి మరి దయనీయంగా తయారైంది. ఫలితంగా చెరువు తూము షట్టర్లు పనిచేయక పోవడంతో కొన్ని చెరువుల నుంచి నీరు వృథాగా పోతోంది.

ఎందుకింత నిర్లక్ష్యం?

మండలంలోని ఏ చెరువు కూడా పూర్తిస్థాయిలో మరమ్మతులకు నోచుకోలేదు. కట్టలు నెర్రెలు బారి గుంతలమయంగా మారాయి. వర్షాకాలం కావడంతో కట్టలు ఎప్పుడు తెగుతాయోనని ఆందోళన చెందుతున్నారు. బీసీపల్లి చెరువు కట్టపై పెద్ద పెద్ద చిల్ల చెట్లు పెరగడంతో కట్టకు వేర్లు దిగి కట్ట మట్టి బద్ధలుగా చీలి ఉంది. మారెళ్ల చెరువు కట్ట చిల్లచెట్లు దట్టంగా పెరిగి కట్ట నెర్రెలుబారింది. అదే విధంగా గుంటుపల్లి, పెదయిర్లపాడు, లక్ష్మక్కపల్లి, కలకొండపాడు, చిలుకూరివారిపల్లి, వేపకంపల్లి, వెంగలాయపల్లి చెరువు కట్టల పరిస్థితి ఇలానే ఉంది. కొన్ని చెరువులు తూములు శిథిలావస్థకు వచ్చేది లాకులు పనిచేయక చెరువు నిండినా నీరు వృథాగా పోతోంది. గత ఏడాది చిలుకూరివారిపల్లి చెరువుల



అడవిని తలపిస్తున్న మురుగమ్మి చెరువు

తూములు షట్టర్లు సక్రమంగా లేకపోవడంతో నీరంతా వృథా పోయాయని రైతులు వాపోయారు.

మరమ్మతులు అంతంతమాత్రమే..

మండలంలోని మురుగమ్మి, అడవిలోపల్లి, లక్ష్మక్కపల్లి, వెలుతుర్లవారిపల్లి, వేపకంపల్లి, పోతవరం చెరువులకు కొన్ని మరమ్మతులు చేశారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయలేదు. చెరువులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో చెరువు భూములను కొంత మంది ఆక్రమించుకొని సాగు చేస్తున్నారు. ఈ ఆక్రమణలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఆక్రమణ చెర..

మండలంలోని పీసీపల్లి, పెద యిర్లపాడు, గుంటుపల్లి, అడవిలోపల్లి, లక్ష్మక్కపల్లి, నేరేడుపల్లి, మురుగమ్మి, తలకొండపాడు, చిలుకూరువారిపల్లి, వేపగుంపల్లి, వితలాపురం, చింతగంపల్లి, తదితర ప్రాంతాల్లో చెరువు చెరువు భూములను ఆక్రమించి సాగు చేస్తున్నారు. కొన్నేళ్లుగా వర్షాలు సక్రమంగా లేకపోవడం, చెరువులు పూర్తిస్థాయిలో నిండకపోవడంతో చెరువు పక్కన ఉన్న రైతులు కొంచెం కొంచెం ఆక్రమిస్తూ చెరువులను చెరబడుతున్నారు

పట్టించుకోని పాలకులు, అధికారులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెరువుల మరమ్మతుల గురించి పట్టించుకోవడంలేదన్న విమర్శలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో వర్షాలు కురిస్తే చెరువులకు మరమ్మతులు చేయకుండా నీరంతా వృథాగా పోయే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.



తూము గుండా లీకై పోతున్న చిలుకూరివారిపల్లి చెరువు



మారెళ్ల చెరువు నుంచి వృథాగా పోతున్న నీరు

ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు, ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

జగనన్నపై అనుచిత వ్యాఖ్యలు హేయం

పొన్నలూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై అసెంబ్లీ వేదికగా హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి అన్నారు. పొన్నలూరులో శనివారం వారు మాట్లాడుతూ మానసిక స్థితి సరిగా లేదని సర్టిఫికెట్ తెచ్చుకున్న వ్యక్తి జగన్ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి నేతలు అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించకుండా నిత్యం జగన్‌పై ఏడుపుతోనే కాలం వెళ్లదీస్తున్నారన్నారు. బాలకృష్ణ వెంటనే జగన్‌మోహన్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

సింగరాయకొండ: జగనన్నపై అసెంబ్లీలో బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మారంరెడ్డి గంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సభలో లేని



పొన్నలూరులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జగనన్నపై బాలకృష్ణ ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. చిరంజీవి, చంద్రబాబుతో విభేదాలు ఉంటే వారితో తేల్చుకోవాలే తప్ప జగనన్నపై ఆరోపణలు చేయటం మంచి పద్ధతి కాదన్నారు. జగనన్నపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

టంగుటూరు: ప్రకృతి వ్యవసాయం లాభదాయకం, ఆరోగ్యమని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి అన్నారు. మండలంలోని సూరారెడ్డిపాలెంలో ఒంగోలు సౌజన్యంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో బహుళ పంటల సాగు అనే అంశంపై రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వెంకటశేషమ్మ వరిలో అధిక దిగుబడులు ఇచ్చే నూతన వంగడాల గురించి, సాగు ఖర్చు తగ్గించుకునే విషయాలను



సూరారెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయం కషాయం పరిశీలిస్తున్న పీడి సుభాషిని

వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా బ్రహ్మాస్త్రం కషాయం తయారు చేసే విధానం చూయించారు. ఆత్మ బీటీఎం కృష్ణ, గ్రామ సహాయకులు ప్రభాకర్, అజయ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యం

సింగరాయకొండ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా ఉండాలని డీపీఓ ఎం వెంకటేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలోని ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజిలో శనివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పారిశుధ్యం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించి కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అంతకముందు డాక్టర్ హరిబాబు హాస్పిటల్ సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు



మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వరరావు

లర్పించి ర్యాలీ నిర్వహించారు. గృహిణులకు తడి చెత్త, పొడిచెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ డి.జయమణి, ప్రిన్సిపాల్ సౌజన్య, ఎంఈఓ కత్తి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీఓ ఆర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఆగని పొగాకు బేళ్ల తిరస్కరణ

టంగుటూరు: పొగాకు వేలం చివరి దశకు చేరుకున్నా పొగాకు బేళ్ల తిరస్కరణ మాత్రం ఆగడం లేదు. నిత్యం వందల సంఖ్యలో పొగాకు బేళ్లను తిరస్కరిస్తూనే ఉన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో జమ్ములపాలెం, తుమాడు గ్రామానికి చెందిన రైతులు వేలానికి 1082 బేళ్లను తీసుకురాగా 863 బేళ్లను కొనుగోలు చేసి 219 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.340, కనిష్ఠ ధర రూ.100, సరాసరి ధర రూ.280.51 పలికింది. వేలంలో 42 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కొండపి: వేలానికి తీసుకొని వచ్చే బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ తెలిపారు.శనివారం వేలం సందర్భంగా రైతులకు పలు సూచనలను సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన బేళ్లకు అధిక ధర పలుకుతుందన్నారు. పంటల మార్పిడి చేసుకోవాలని, బోర్డ్



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

అనుమతించిన మేర పొగాకును సాగు చేయాలని సూచించారు. వేలానికి ఒక రోజు ముందు వచ్చి మార్కెట్ వివరాలను తెలుసుకోవాలని సూచించారు. క్లస్టర్ పరిధిలోని చవటపాలెం, దాదా నాయుడుపాలెం, రామాయపాలెం, కొండపి, దాసిరెడ్డిపాలెం, పోలిరెడ్డిపాలెం గ్రామాల రైతులు 1317 బేళ్లను వేలానికి తీసుకురాగా 1173 బేళ్లను కొనుగోలు చేసి 144 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.340, కనిష్ఠ ధర రూ.90, సరాసరి రూ.296.62గా నమోదైంది. వేలంలో 18 కంపెనీలు పాల్గొన్నాయి.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

కొండపి: ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని కట్టెల ట్రాక్టర్ ఢీకొంది. ఈ సంఘటన మండలంలోని కె.ఉప్పలపాడులో జరిగింది. ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ వివరాల ప్రకారం.. కొండపి మండలం జాల్లపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి కట్టెల ట్రాక్టర్‌ను కె.ఉప్పలపాడు నుంచి కొండపికి తీసుకొని వస్తున్నాడు. ఉప్పలపాడు ఎస్సీ కాలనీ సమీపంలో అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కొప్పోలు మాలకొండయ్య, తాళ్లూరు కోటయ్యలు ద్విచక్ర వాహనంపై రోడ్డు పక్కన ఆగి ఉన్నారు. వేగంగా వచ్చిన కట్టెల ట్రాక్టర్ ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టడంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరిలో మాలకొండయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

హోటల్స్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణస్వీకారం

కందుకూరు: ప్రకాశం జిల్లా హోటల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం రాత్రి స్థానిక ఆదిత్య హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా హోటల్స్ అసోసియేషన్ నూతన ప్రెసిడెంట్‌గా మర్రిపూడి శ్రీనివాసరావు, సెక్రటరీగా కె.నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా బి.మహేష్, ఉపాధ్యక్షుడిగా మస్తాన్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి హాజరైన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ రంగంలో ఉన్న సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

రమణ, కార్యనిర్వాహక కార్యదర్శి వై కొండయ్యనాయుడు, కోశాధికారి బీఎల్ఎస్‌బాబు, పిడికిటి వెంకటేశ్వర్లు, డబ్బుకొట్టు మల్లికార్జున, క్రిష్ణ, కిశోర్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లలితాదేవి అలంకరణలో కామేపల్లి పోలేరమ్మ తల్లి



జమ్ములపాలెంలో లక్ష్మీదేవిగా...



భైరవకోనలో గజలక్ష్మీదేవిగా త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు



పెదయిర్లపాడులో ధనలక్ష్మి అలంకరణ



పామూరులో గాయత్రీదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు

లలితాత్రిపుర సుందరీదేవి పాహిమాం..



లలితా త్రిపుర సుందరిదేవిగా వల్లూరమ్మ అమ్మవారు



నేతివారిపాలెంలో లలితాత్రిపురసుందరి దేవి అలంకరణలో..



నాగిరెడ్డిపాలెంలో లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు



పామూరులో విశిష్ట అలంకరణతో వాసవీమాత మూల విగ్రహమూర్తి

టంగుటూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ప్రసిద్ధి గాంచిన వల్లూరమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అర్చకులు రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. రాత్రికి అమ్మవారి ఉత్సవం కనులపండువగా సాగినట్లు ఈఓ బి.రమేష్ తెలిపారు. జమ్ములపాలెం అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో అమ్మవారు లక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు.

కొండపి: మండలంలోని నేతివారిపాలెంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కె.ఉప్పలపాడులో అర్చకులు రాఘవేంద్ర ఆధ్వర్యంలో స్వామికి పూజలుచేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కామేపల్లి పోలేరమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారు లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 29వ తేది మూలా నక్షత్రం సందర్భంగా ఆలయంలో సరస్వతి పూజ చేస్తామని ఈఓ భైరాగి తెలిపారు.

పొన్నలూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మండలంలోని నాగిరెడ్డిపాలెం పోలేరమ్మతల్లి అమ్మవారు శనివారం లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని అందంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు.

పామూరు: దసరా శరన్నవరాత్రులలో భాగంగా పామూరు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారు నారాయణీదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. వల్లీభుజంగేశ్వరస్వామి ఆలయంలో వల్లీ అమ్మవారు విశిష్ట అలంకరణలో భక్తులకు దర్శనమీయగా, మహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు గాయత్రీ అలంకరణలో దర్శనమిచ్చారు.

పీసీపల్లి: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా పెదయిర్లపాడు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

సీఎస్‌పురం(పామూరు): దసరా శరన్నవరాత్రి వేడుకలలో ఆరవ రోజు త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో త్రిముఖదుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో పూజలు చేశారు. సీఎస్‌పురంలో రాచూరి పెద్దమ్మ అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కనిగిరిరూరల్: పట్టణంలోని శివనగర్కాలనీ దత్త పీఠంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు లలితా త్రిపురసుందరిదేవిగా దర్శనమిచ్చారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



కనిగిరి దత్తపీఠంలో లలితా పరమేశ్వరి అమ్మవారిగా

వివాదాస్పద అధికారికి ఎమ్మెల్యే వత్తాసు

వలేటివారిపాలెం: భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే నాగేశ్వరరావు వత్తాసు పలకడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే..మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానాన్ని శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దర్శించుకున్నారు. అనంతరం కొండమీద డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా దేవాలయంలో సన్నిధిలో రాజకీయాలు గురించి మాట్లాడను అంటూనే గత ప్రభుత్వంలో చేసిన పొరపాట్లు చేయమని రాజకీయాల గురించి ప్రస్తావించారు. గత ప్రభుత్వం కన్నా మా కూటమి ప్రభుత్వంలోనే అన్నదానం బాగుందని ఆయనకాయనే ప్రశంసించుకున్నారు. ఈ నెల 20న డిప్యూటీ కమిషనర్ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా దేవాలయంలో టెంకాయలు కొట్టించడం, ప్రత్యేక దర్శన టిక్కెట్ రూ.500లకు పెంచడం, ఆగస్టు 3నజరిగిన హుండీ లెక్కింపులో అవకతవకలకు పాల్పడటం, షాపు యజమానికి రూ.10 వేల జరిమానా విధించడం, ఆలయ సిబ్బందికి మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోవడం, భక్తులతో దురుసుగా మాట్లాడటం వంటి సమస్యలు ఉన్నా..అవేమి ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదు. ఈఓను ప్రశ్నించకుండా ఆ వార్తలు ప్రచురించిన విలేకరులను తప్పుపట్టి ఈఓను వెనుకేసుకొని వచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు

అటెండర్, నైట్‌వాచ్‌మన్ పోస్టులను భర్తీ చేయాలి

లింగసముద్రం: డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 29న స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం వీఆర్ఏలు ఆర్ఐ రమణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న నైట్‌వాచ్‌మన్, అటెండర్ పోస్టులను గ్రామ రెవెన్యూ సహాయకులతో తక్షణమే భర్తీ చేయించాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏ నియమ నిబంధనలకు విరుద్ధంగా రేయింబవళ్లు పనిచేయిస్తున్నారని, గ్రామాల్లో పని చేయాల్సిన విఆర్ఏలు ఆఫీసుల్లో అటెండర్లుగా ఉపయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ రెవెన్యూ సహాయకులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తక్షణమే నైట్‌వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను వెంటనే భర్తీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

పగలే వీధి దీపాల వెలుగులు

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు గ్రామ పంచాయితీలోని అరుంధతీనగర్‌లో వారం రోజులుగా వీధి దీపాలు పగలు, రాత్రీ తేడా లేకుండా వెలుగుతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉదయం పూట ఆపడం లేదు. దీంతో లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో స్థానికులు గ్రామ పంచాయితీ సిబ్బందికి తెలియచేసినా ఉపయోగం లేదని కాలనీ వాసులు తెలిపారు. గ్రామ పంచాయతీకి ఇప్పటికే విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్న పరిస్థితుల్లో ఇలా నిర్లక్ష్యం వహించడం వలన విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చే అవకాశం ఉంది.



పగలు కూడా వెలుగుతున్న వీధిలైట్లు